
సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 21 । జూన్ । 2025



రెవెన్యూ దినోత్సవం

గాంధీనగర్: ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం జరిగింది. సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



ఘంటసాలలో థాయ్‌లాండ్ బృందం

ఘంటసాల: ఘంటసాలలోని బౌద్ధ స్తూపాన్ని థాయ్‌లాండ్‌కు చెందిన శిల్పకాన్ యూనివర్సిటీ ఆర్కియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ సక్రవల్లి భోత్మ బృందం శుక్రవారం సందర్శించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యదాన నిమిత్తం శుక్రవారం రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. ఘంటసాల మండలం తూర్పులంక పల్లికి చెందిన వీరమాచనేని ప్రతాప్‌కుమార్, రోజా పావని దంపతులు వారి కుమార్తె ధాన్వి పేరుమీద రూ. 54 వేల విలువైన కూరగాయల కటింగ్ మిషన్, నిత్యాన్నదాన పథకానికి మరో రూ. 46,116 విరాళంగా అందజేశారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం విరాళాన్ని చెక్కు రూపంలో సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన నరావుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

టీటీఈ నిజాయతీ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నిబద్ధతతో ఉండేవారు నీతినిజాయతీతో ఉంటారు. దీనికి నిదర్శనం టీటీఈ అవినాష్. వివరాల్లోకి వెళ్తే అతను విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగంలో టీటీఈ(ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్). రైలులో ప్రయాణికులు మర్చిపోయిన బంగారం, నగదు కలిగిన బ్యాగును గుర్తించి ఆర్పీఎఫ్ సిబ్బంది సహకారంతో శుక్రవారం వాటి యజమానులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. విజయవాడలో టీటీఈగా చేస్తున్న అవినాష్ గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో రాయనపాడు నుంచి కాకినాడ టౌన్ మధ్యలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఏ3 కోచ్‌లో 35వ నంబర్ బెర్త్ కింద గుర్తు తెలియని లగేజీని గుర్తించాడు. వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత ప్రయాణికుల సమక్షంలో బ్యాగును తెరచి చూడగా అందులో రెండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 37 వేల నగదు లభ్యమైంది. వీటితో పాటు ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్‌లు ఉండటంతో బ్యాగు యజమానులను గుర్తించి ఆర్పీఎఫ్ పోలీసుల సమక్షంలో వారికి అప్పగించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీసీఎం రాంబాబు.. అవినాష్ నిజాయతీని ప్రశంసించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి

హనుమాన్‌జంక్షన్ రూరల్: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఈగల్ చీఫ్, ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలోని మోహన్ స్పిన్ టెక్స్ కర్మాగారంలో 'నో డ్రగ్స్ నో టెన్షన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాదకద్రవ్యాల నియంత్రణపై కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ గంజాయిని సమూలంగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. గంజాయిపై ఎలాంటి సమాచారమైన ఈగల్ టీంకు ప్రజలు స్వచ్ఛందంగా ఇవ్వాలని ఐజీ కోరారు. కంకిపాడు సీఐ మురళీకృష్ణ, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ-2 నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఒంటి కాలిపై వినూత్న నిరసన



మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బందరు నవకళ సెంటర్లో శుక్రవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) వంటి కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు ఒంటికాలిపై నిల్చుని వినూత్న నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రపు పోలినాయుడు మాట్లాడుతూ కార్మికుల పనిగంటలను ఎనిమిది నుంచి పది గంటల వరకు పెంచడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణకు వామపక్షాల ఐక్య పోరాటాలే ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. ఏఐటీయూఎఫ్ నేత వెంకటరామయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తానా అంటే తందానా అన్నట్టుగా వ్యవహరించడాన్నీ తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మండల కార్యదర్శి చిరువోలు జయరావు, ఏఐటీయూసీ నాయకులు ఒంటిపులి లక్ష్మణరావు, ఎర్రంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బై..పాస్ అయ్యేదెన్నడో!

విజయవాడ వెస్ట్ బైపాస్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో అని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పనులు దాదాపు పూర్తయినా ప్రారంభం మరింత ఆలస్యమవుతోంది. హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్య కారణంగా పలుచోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కూడా దీనిపై నిర్లక్ష్యం చూపడంతో ఏడాదిగా పనులు అడుగు కూడా ముందుకు పడటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వం వదిలి వెస్ట్ బైపాస్ ప్రారంభానికి చొరవ చూపాల్సి ఉంది.



విజయవాడ వెస్ట్ బైపాస్

- వెస్ట్ బైపాస్ ప్రారంభమెప్పుడో!
- చినఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల మేర బైపాస్
- 98 శాతానికి పైగా పనులు పూర్తి
- గత ప్రభుత్వంలో రోడ్డు పనులు ప్రారంభం కాకుండా కుట్ర
- కొలిక్కి రాని ల్యాంకో టవర్ల సమస్య
- పట్టించుకోని ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వెస్ట్ బైపాస్ రహదారిని అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా పనులు సాగడం లేదు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు, విజయవాడ ఎన్‌హెచ్ఏ ఆర్వో కార్యాలయ అధికారి అలసత్వం తోడైందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

మరింత ఆలస్యం

గత ప్రభుత్వ హయంలో.. రైతుల ముసుగులో టీడీపీ నాయకులు చేసిన కుట్రే నేడు శాపమైంది. ఆ చిక్కుముడే ఇప్పుడు ప్రతిబంధకంగా మారింది. విజయవాడ వెస్ట్ బైపాస్ పూర్తయితే నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజల కల ఇప్పట్లో నెరవేరేలా లేదు. మరింత సమయం పట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏ ఆర్వో కార్యాలయ అధికారులు చిత్తశుద్ధితో పనులను పూర్తి చేసేందుకు కృషి చేయకపోవడంతో జాప్యం జరుగుతోంది.

టవర్ల మార్పిడి వెనక అక్రమాలు!

అయితే వీటి మార్పిడికి విజయవాడ ఆర్వో కార్యాలయం అధికారులు రూ.32.58 కోట్లు అంచనాలు వేశారు. మూతబడిన సంస్థకు సూపర్‌వైజేషన్‌కు చార్జీల కింద రూ.50 లక్షల పైగా చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. దీంతో మూత పడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వెనుక భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతులు కోర్టు మెట్లు ఎక్కారు. రైతులను ఇబ్బంది పెడుతున్న వ్యవహారంలో ఎన్‌హెచ్ఏ, రాధా టీఎంటీ, పాత ల్యాంకో యాజమాన్యాల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది. ఎన్‌హెచ్ఏ ఆర్వో కార్యాలయ అధికారి చొరవ చూపటం లేదు. ఆ ప్రాంతంలో టవర్లు మార్చితే, తమ పొలాలు పోతాయనే ఉద్దేశంతో రైతులు అడ్డుకుని టవర్ల ఎత్తు పెంచితే సరిపోతుందనే వాదనకు వారు తెర లేపారు. ప్రభుత్వం తలొగ్గి టవర్ల ఎత్తు పెంపునకు నిర్ణయం తీసుకున్నా.. కోర్టులో ఉన్న కేసు ఇప్పుడు ప్రతిబంధకంగా మారింది. దీనికి పరిష్కారం చూపడంలో ప్రభుత్వంతోపాటు, ఎన్‌హెచ్ఏ ఆర్వో కార్యాలయ అధికారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్

ఈ బైపాస్ పనులు పూర్తి అయితే , విజయవాడ నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. బైపాస్ అందుబాటులోకి వస్తే విజయవాడ-విశాఖపట్నం, విశాఖపట్నం-విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఉదాహరణకు చినఅవుటుపల్లినుంచి వారధి వరకు ప్రయాణం చేయాలంటే గంటనుంచి గంటన్నర సమయం పడుతోంది. ఇదే వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే కేవలం 15 నిముషాలలోపే చేరుకొనే అవకాశం ఉంది. దీనికితోడు విజయవాడ ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు గత ప్రభుత్వ హయంలో డీపీఆర్ సిద్ధం చేసిన తూర్పు బైపాస్ రోడ్డు పనులకు కూటమి ప్రభుత్వం మోకాలు అడ్డుపెట్టింది. ఔటర్ రింగ్ రోడ్డు సాకుగా చూపి దీనికి మంగళం పాడింది.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయంలోనే 98 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు శరవేగంగా ముందుకు సాగాయి . కేవలం ప్యాకేజి -3 కింద చిన అవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు 30కిలోమీటర్ల బైపాస్ నిర్మాణానికి సంబంధించి కేవలం 300 మీటర్ల మేర మాత్రమే మిగిలింది. 2024 జనవరిలో ప్రజలకు బైపాస్‌ను అందుబాటులోకి తెచ్చే యత్నం చేసింది. టవర్ల షిఫ్టింగ్ , సాంకేతిక సమస్యలను సాకుగా చూపి, టీడీపీ నేతలే రైతుల ముసుగులో పనులను అడ్డుకున్నారు. రూ.1,148కోట్లతో , పనులను మెగా సంస్థ ఫిబ్రవరి 2021లో చేపట్టింది. ఈ రహదారి కోసం 14 గ్రామాల్లో భూసేకరణ చేశారు. కృష్ణా జిల్లాలో వెదురుపావులూరు, రామచంద్రాపురం, కొండపావులూరు, బీబీ గూడెం, గన్నవరం, చిన్న అవుటుపల్లి, ఎన్టీఆర్ జిల్లాలో గొల్లపల్లి, జక్కంపూడి, అంబాపురం , పి.నైనవరం, పాతపాడు, కెపీ కండ్రిక, నున్న గ్రామాల పరిధిలో మొత్తం 188.92 హెక్టార్ల భూమిని సేకరించారు. దీనికోసం రూ.416.60 కోట్లు ఖర్చు చేశారు.

ల్యాంకో ట్రాన్స్‌మిషన్ల టవర్ల మార్పిడే సమస్య



విజయవాడ రూరల్ మండలంలో అడ్డంకిగా మారిన విద్యుత్ టవర్లు

ప్రధానంగా బైపాస్ రోడ్డుకు మధ్యలో హై ఓల్టేజీ విద్యుత్తు లైన్లు వెళుతున్నాయి. కృష్ణా జిల్లాలో ఒకచోట, ఎన్టీఆర్ జిల్లాలో 12 చోట్ల ఏపీ ట్రాన్స్‌కో, ల్యాంకో, పవర్‌గ్రిడ్‌కు సంబంధించిన విద్యుత్ లైన్లను మార్చాలింది. ఇందులో గత ప్రభుత్వం చొరవ చూపటంతో కోర్టు కేసులను అధిగమించి రూ.15 కోటల్తో ఏపీ ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్ విద్యుత్ లైన్లను మార్చారు. అయితే ప్రస్తుతం 300 మీటర్లు జక్కంపూడి, గొల్లపూడి మధ్య ల్యాంకో ట్రాన్స్ మిషన్ టవర్ల మార్పిడి సమస్య జటిలంగా మారింది. ల్యాంకో చెందిన ట్రాన్స్ మిషన్‌కు సెంట్రల్ ఎలక్ట్రికల్ రెగ్యులేషన్ కమిటీ నుంచి లైసెన్సు లేదు. ఈ లైసెన్సు లేని సంస్థకు చెందిన టవర్లను మార్చే అధికారం ఎన్‌హెచ్ఏకు లేదు.

యోగా.. వారసత్వ సంపదలో కలికితురాయి

వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి (ఫ్రాన్స్)ఎలీసా రేనాల్డ్స్



వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతీయ వారసత్వ సంపదలో యోగా కలికితురాయి అని వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి ఎలీసా రేనాల్డ్స్ అన్నారు. కృష్ణా నదిలో 'యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా' ఈవెంట్‌ను నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించడం అభినందనీయమన్నారు. ఇటీవల కృష్ణా నదిలో నిర్వహించిన 'యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా' ఈవెంట్‌లో పడవలపై వేలాదిమంది యోగాసనాలు వేసి ప్రపంచ రికార్డు సాధించిన నేపథ్యంలో శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధి ఫ్రాన్స్‌కు చెందిన ఎలీసా రేనాల్డ్స్.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేనాల్డ్స్ మాట్లాడుతూ భారతదేశం యోగాసనాలతో ప్రపంచానికి అమూల్యమైన బహుమతి ఇచ్చిందన్నారు. యోగా వంటి ఆరోగ్య విధానం బృహత్తర రికార్డులకే పరిమితం కాకూడదని, అందరూ తప్పక ఆచరించాలని ఎలీసా రేనాల్డ్స్ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ టీమ్ ఎన్టీఆర్ కృషి.. ప్రజలు స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు అందరి సహకారంతోనే వరల్డ్ రికార్డు సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో లంకా దినకరన్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, సబ్‌కలెక్టర్ కె.చైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల అగచాట్లు

రెండో రోజూ అరకొర బస్సులతో సరి



విజయవాడ ఆటోనగర్ బస్ టెర్మినల్‌లో పల్లెవెలుగు బస్సు వద్ద రద్దీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్సులను విశాఖపట్నానికి మళ్లించడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. రెండు రోజులుగా సిటీ, లైన్ సర్వీసులు సరిపడా రాకపోవడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. నిత్యం మచిలీపట్నం,పామర్రు, ఉయ్యూరు, కంకిపాడుతో పాటు పలు గ్రామాల నుంచి పనులకు వస్తుంటారు. కేవలం నాన్‌స్టాప్ బస్సులను మాత్రమే ఆర్టీసీ అధికారులు నడపడంతో మిగతా గ్రామాల నుంచి విజయవాడకు ప్రయాణికులు రావడానికి నానా ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు ఆటోనగర్ బస్‌టెర్మినల్ వద్ద వివిధ గ్రామాలకు వెళ్లడానికి ప్రయాణికులు నిలువ కాళ్లపై ఎదురు చూడాల్సి వచ్చింది. గంటకు ఒక బస్సో... గంటన్నరకు మరొక సిటీ బస్సు రావడంపై ఇంటికి ఎలా వెళ్లాలో అర్థంకాక తలపట్టుకున్నారు. మచిలీపట్నం. గుడివాడ, కై కలూరు, భీమవరానికి మాత్రమే నాన్‌స్టాప్ బస్సులను అరకొరగానే నడిపారు.



యోగాంధ్ర రూపంలో ఇమిడిన కంకిపాడు హైస్కూల్ విద్యార్థులు

ఆకట్టుకున్న యోగాంధ్ర విన్యాసాలు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాంధ్ర అక్షరాల ఆకారంలో విద్యార్థులు ఇమిడిపోయి యోగాంధ్ర ప్రాధాన్యతను చాటిచెప్పారు. హెచ్ఎం డి.ఉమాదేవి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -కంకిపాడు

సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ స్కూల్ సమీపంలో నివసిస్తున్న కె.దుర్గాంబ ఇంట్లోకి ఈ నెల 16వ తేదీన ఓ యువకుడు చొరబడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెను గంజాయి మత్తులో ఉన్న ఆ యువకుడు బెదిరించి దాడి చేశాడు. ఆమె బంగారు గాజులు, ఇంట్లోని కొన్ని ఖరీదైన వస్తువులను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఘటనపై సింగ్‌నగర్ పోలీసులు దొంగతనం కేసు నమోదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.



'మత్తు' వదలరా!

- విజయవాడలో మితిమీరుతున్న గంజాయి మత్తు ఆగడాలు
- దారిదోపిడీ, చోరీలు, చిల్లర దొంగతనాలు, మహిళలతో అసభ్య ప్రవర్తన
- అరకొర కేసులతో పోలీసుల కాలయాపన
- జాడ లేని ఈగల్ టీమ్‌లు

విజయవాడస్పోర్ట్స్: కూటమి పాలనలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎక్కడ పడితే అక్కడ వాటిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీంతో 'మత్తు'కు యువత చిత్తవుతోంది. యువత 'మత్తు' వదలడానికి పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో విజయవాడ, పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. 14 నుంచి 25 ఏళ్ల యువత గంజాయి మత్తుకు బానిసలై అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఉదంతాలు ఇటీవల అనేకం వెలుగు చూశాయి. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో ఇటీవల రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘటనలో 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి మత్తులోనే ఘర్షణ చోటు చేసుకుందని పోలీసుల విచారణలో తేలింది. సదరు యువకుడి నుంచి 25 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రమాదకరమైన ఎండీఎంఈ మాదకద్రవ్యాలను సైతం ఆ యువకుడు సేవిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బస్టాండ్ సమీపంలో గంజాయి మత్తులో నిత్యం వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ విధులు నిర్వర్తించడం కత్తిమీద సాములా మారిందని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. సింగ్‌నగర్‌లో యువకులు గంజాయి మత్తులో ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల్లో పెట్రోల్‌ను తస్కరిస్తున్న సంఘటన తాజాగా వెలుగుచూసింది. ఈ ఉదంతం సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. పటమట పీఎస్ పరిధిలోని దర్శిపేట, న్యూ ఆర్టీసీ కాలనీ, ఆటోనగర్‌లోని దుకాణాల్లో ఇటీవల చోరీలు అత్యధికంగా జరిగాయి. వీటిల్లో కొన్ని చోరీలను పోలీసులు గుర్తించి, ఇవన్నీ గంజాయి మత్తులోనే జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని జక్కంపూడి, అంబాపురం, వాగు సెంటర్ కొండప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువైంది. యువకులు గంజాయి మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిక్కరు దొరకరు

గత ఆరు నెలలుగా గంజాయి మత్తు ఆగడాలు నగరంలో విపరీతంగా పెరిగాయని తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో గంజాయి తీసుకొచ్చి విక్రయించే ప్రధాన ముఠా నాయకులను అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రౌడీ షీటర్లు, కేడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ముఠాలుగా ఏర్పడి గంజాయి అక్రమ సరఫరాకు పాల్పడుతున్నట్లు ఇటీవలే రక్షణ వ్యవస్థ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ప్రధాన సరఫరాదారులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో గంజాయి ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నామనే నిస్సహాయతను కొందరు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

కానరాని ఈగల్ టీంలు, అవగాహన ఏది..

మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించడానికి ఈగల్ బృందాలు విశేషంగా కృషి చేసేవి. ప్రస్తుతం కమిషనరేట్ ఉన్నతాధికారులు ఈగల్ బృందాలను ఉత్తేజపరిచే యోచన చేయకపోవడం గంజాయి విస్తృతికి ఓ కారణమైంది. పలు స్వచ్ఛంద సంస్థలు, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు సంయుక్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి మత్తు పదార్థాల దుష్పరిణామాలను ప్రజలకు వివరించేవి. ప్రధానంగా కళాశాలలు, గుర్తించిన హాట్‌స్పాట్‌ల వద్ద ఈ సదస్సులు నిర్వహించే వారు. ప్రస్తుతం ఇలాంటి గురుతర బాధ్యతను విస్మరించినట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న హాట్‌స్పాట్‌లు

నగరంలోని 13 పీఎస్‌ల్లో మత్తు పదార్థాలు విక్రయించే, వినియోగించే ప్రాంతాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మత్తు పదార్థాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఏటా పోలీస్ శాఖ గుర్తించి, వాటిని హాట్‌స్పాట్లుగా నిర్ధారిస్తోంది. అయితే వస్తున్న ఫిర్యాదులు, నమోదవుతున్న కేసులు, చోటు చేసుకుంటున్న దుర్ఘటనలు ఆధారంగా వీటి గుర్తింపు కొనసాగుతుంది. తాజాగా చేసుకుంటున్న ఘటనలు హాట్‌స్పాట్‌ల సంఖ్యను విపరీతంగా పెంచే అవకాశం ఉంది.

జరుగుతున్న ఆగడాలకు.. తీసుకుంటున్న చర్యలకు పొంతనేది..

విజయవాడ, రూరల్ ప్రాంతాల్లోని 28 పోలీస్ స్టేషన్‌లలో గడిచిన ఆరు నెలల్లో(ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి జూన్ 31 వరకు) 73 మాత్రమే మత్తు పదార్థాల కేసులు నమోదయ్యాయి. కమిషనరేట్ పరిధిలో పని చేసే యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్స్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఈ కేసుల్లో 175 మందిని మాత్రమే అరెస్ట్ చేయగలిగారు. అయితే వెయ్యి కేజీలకు పైగా గంజాయిని సీజ్ చేసినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా గంజాయి మత్తులో జరిగే ఆగడాలకు, రక్షణ యంత్రాంగం తీసుకున్న చర్యలకు పొంతన లేకుండా ఉందనేది ప్రజాభిప్రాయం.

వేరుశనగపంట సాగుకు నూరుశాతం సబ్సిడీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో వెయ్యి హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నూరుశాతం సబ్సిడీ ఇస్తోందని ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకం నూనె విత్తనాలు - వంటనూనెల జాతీయ మిషన్ కృషోన్నతి యోజనతో జిల్లాలో రబీ సీజన్‌లో 500 హెక్టార్లు, ఖరీఫ్ కాలంలో 500 హెక్టార్లను ఒక క్లస్టర్‌గా గుర్తించి రైతులకు నూతన వేరుశనగ వంగడాలు సాగు చేసుకునేలా ప్రోత్సహిస్తోందన్నారు. వేరుశనగ వశిష్ట రకం నూరుశాతం రాయితీతో అందించి పంట విస్తీర్ణాన్ని పెంచటమే ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులకు శిక్షణ ఇచ్చి అధిక దిగుబడులు సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఈ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయాధికారి ఇతర అధికారులు ఉంటారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు, ఏడీ మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు దగ్ధం

ఆకతాయి కాల్చిపడేసిన సిగరెట్ కారణం?



పటమట(విజయవాడతూర్పు): ఓ ఆకతాయి చేసిన పనికి లక్షలు విలువ చేసే కారు దగ్ధమయింది. వివరాల ప్రకారం పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని కరెన్సీనగర్‌లో ఉన్న ఆయుష్ ఆస్పత్రికి శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన పి.ప్రవీణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి చికిత్స నిమిత్తం కారులో వచ్చి కుటుంబ సభ్యులను ఆస్పత్రి ముందు దింపి పక్కనే ఉన్న ఖాళీస్థలంలో పార్కింగ్ చేశారు. అదే సమయంలో అక్కడ గుర్తుతెలియని ఓ ఆకతాయి సిగరెట్టును తాగి ఆర్పకుండా అక్కడ ఉన్న చెత్తలో వేయటంతో మంటలు చెలరేగి కారుకు అంటుకున్నాయి. స్థానికులు చూసి పెద్దగా కేకలు వేయటంతో కారు యజమాని వచ్చి కారు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే కారంతా దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆటోనగర్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు కాలి బూడిదయింది. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. పటమట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ఎమ్మెల్యేపై టీడీపీ నేతల ఫైర్

- కోడూరు టీడీపీ సమావేశంలో తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం
- నియోజకవర్గంలో టీడీపీని లేకుండా చేయాలని చూస్తున్నారు
- మండలంలో 70, 80 సీసీ రోడ్లు వేస్తే ఒక్కటీ టీడీపీ వారికి ఇవ్వలేదు
- ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డ టీడీపీ మండల అధ్యక్షుడు బండే



ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బడేవారిపాలెంకు చెందిన ఓ సీనియర్ టీడీపీ నేత, చిత్రంలో బండే శ్రీనివాసరావు, బత్తిన దాసు తదితరులు

అవనిగడ్డ: కూటమి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన కుటుంబ సభ్యుల తీరుపై స్థానిక టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో టీడీపీని లేకుండా చేయాలనే కుట్రలను సాగనివ్వమని హెచ్చరించారు. ''మీరు ఏం చేసినా ఊరుకుంటారనుకుంటున్నారేమో.. ప్రజలు కన్నెర్ర జేస్తారు.. తిరగబడే రోజు దగ్గరలోనే ఉంది'' అంటూ స్ట్రాంగ్‌గా వార్నింగ్ ఇచ్చారు. కోడూరు మండలంలో 13 పంచాయతీల టీడీపీ గ్రామకమిటీ ఎన్నికల తీరుపై గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. కోడూరు మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు బత్తిన దాస్ ఈ కార్యక్రమానికి విచ్చేయగా ఆయన ముందే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తీరుపై తెలుగు తమ్ముళ్లు తీవ్రస్థాయిలో మండిపడడం గమనార్హం.

అధికారంలో ఉన్నా ఏం చేయలేకపోతున్నాం: టీడీపీ మండల అధ్యక్షుడు బండే

పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గంలో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ బండే శ్రీనివాసరావు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో టీడీపీని లేకుండా చేయాలని చూస్తున్నారని, అది ఎన్నటికీ జరగదని, పార్టీని కాపాడుకునేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నారని అన్నారు. పనుల కోసం ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి లెటర్ ఇవ్వమంటే ఇవ్వరని, పదవుల్లో టీడీపీ, జనసేనకు ఫిఫ్టీ ఫిఫ్టీ అనే సూత్రాన్ని పాటించడం లేదని, గ్రామాల్లో ఒక్క కార్యకర్తకు పనిచేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 70 సీసీ రోడ్లు వేస్తే ఒక్క రోడ్డు కూడా టీడీపీ నాయకుడు, కార్యకర్తకు ఇవ్వలేదని, ఇదేం న్యాయమని నిలదీశారు. అవసరమైతే మన సమస్యలు చెప్పుకునేందుకు చంద్రబాబు దగ్గరకో, లోకేష్ దగ్గరకో వెళదామని, పనిచేసే కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. మండల స్థాయి నుంచి సచివాలయ స్థాయి వరకూ జరిగే బదిలీలన్నీ ఎమ్మెల్యే కుటుంబ కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు.

రాజాబాబు ఏమన్నా తోపా?

ఏదైనా అంటే జనసేన నాయకుడు రాజాబాబుకు చెబుతామంటున్నారని, రాజాబాబు ఏమన్నా తోపా అని వి.కొత్తపాలెంకు చెందిన ఓ టీడీపీ నాయకుడు మండిపడ్డారు. తామందరం లేకుండా రాజాబాబు వచ్చారా... ఎన్నికలప్పుడు కాళ్లు, గడ్డాలు పట్టుకున్నారని, మీరు లేకపోతే దిక్కులేదన్నారని, అప్పుడేమో ఇళ్లకు వచ్చి బతిమలాడారని.. ఇప్పుడేమో లెక్కచేయడం లేదని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు రాజా, అల్లుడు అశ్వినికుమార్‌ని ఉద్దేశించి ఓ టీడీపీ నేత ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాసిపెట్టుకో... ప్రజలు కన్నెర్ర చేసే రోజు దగ్గరలోనే ఉంది

ముసుగులు వేసుకునే నాయకుడు ఒక్కో ముసుగు తీసి పార్టీలు మారుతున్నాడని, మీ ఇష్టానుసారంగా మాట్లాడితే ఎదురు చెప్పేవారు లేరనుకుంటున్నారా అంటూ బడేవారిపాలెంకు చెందిన ఓ సీనియర్ టీడీపీ నేత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడున్న కార్యకర్తలెవరికీ న్యాయం జరగడం లేదని, ప్రతిపక్షంలో ఉన్నామో, అధికార పక్షంలో ఉన్నామో అర్థంకాని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పనులు చేసే ఎమ్మార్వోలు, అధికారులు, పోలీసులను ఎమ్మెల్యే బదిలీ చేయిస్తున్నారని, మీరు చేసే దురాగాతాలను రాసిపెట్టుకోవాలని, ప్రజలు కన్నెర్ర జేసే రోజు దగ్గరలోనే ఉందని ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులను హెచ్చరించారు.

కంగుతిన్న పరిశీలకుడు బత్తిన...

స్థానిక జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడటంతో సమావేశానికి విచ్చేసిన మండల పరిశీలకుడు బత్తిన దాసు కంగుతిన్నారు. మండలంలో ఉన్న ఈ పరిస్థితిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని చెప్పి బుజ్జగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ నేతలు మండిపడ్డ తీరు కూటమి పార్టీలు జనసేన, టీడీపీ మధ్య మరింత అగ్గి రాజేసినట్టయింది.

మా స్కూలు మాకు కావాలి!

- ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది
- డీఈవో పీవీజే రామారావుకు గోడు వెళ్లబుచ్చుకున్న గ్రామస్తులు



డీఈవో రామారావుకు సమస్యను వివరిస్తున్న కొతవరం గ్రామస్తులు

చిలకలపూడి(మచిలీపట్నం): తమ గ్రామంలో ఉన్న పాఠశాలను అక్కడే కొనసాగించాలని గుడ్లవల్లేరు మండలం కొతవరం హరిజనవాడకు చెందిన గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు మచిలీపట్నంలో డీఈవో పీవీజే రామారావును కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 117 ను అనుసరించి తమ గ్రామంలోని పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను రద్దు చేసి కిలోమీటరు దూరంలో ఉన్న కొతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. ఆ పాఠశాలకు వెళ్లే రహదారి ఎంతో ప్రమాదకరంగా ఉంటుందని, అంతేకాకుండా గుడివాడ – మచిలీపట్నం రహదారి దాటాల్సి ఉన్నందున విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఇరువురు పిల్లలు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలో ఉన్న పాఠశాలలోనే 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలని వారు అభ్యర్థించారు.

రెండున్నర కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది

ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామ శివారు ఆనందపురంలో ఎప్పటి నుంచో మండల పరిషత్ పాఠశాల నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రెండున్నర కిలోమీటర్లు దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లమంటున్నారని టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ కంభం రమేష్‌బాబు తెలిపారు. తమ గ్రామంలోని పాఠశాలలో ప్రస్తుతం 14 మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడిని నియమించారని, అయితే ఇంకో ఉపాధ్యాయుడిని నియమించి ఇక్కడే కొనసాగిస్తే గ్రామంలో మరికొంత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. పాఠశాలను మూసివేస్తే ఉయ్యూరు, ఆకునూరు, గండిగుంట వెళ్లాలంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని ఆయన డీఈవోకు వివరించారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా ఉన్న పాఠశాలలోనే మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యను బోధించాలని కోరారు. ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని ఆయన విన్నవించారు.

డీసీఎంఎస్ ఛైర్మన్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకారం



డీసీఎంఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బండి రామకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణాజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఛైర్మన్‌గా బండి రామకృష్ణ శుక్రవారం విజయవాడ సూర్యారావుపేటలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయ అధికారులతో సమావేశమయ్యారు. డీసీఎంఎస్ పరిధిలో ఉన్న భూములు, గిడ్డంగులు, మూల నిధులు, రావాల్సిన నిధుల గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం పని చేస్తుందని, అన్నదాతకు మేలు చేసే విధంగా సొసైటీని తీర్చిదిద్దుతామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అతి తక్కువ ధరకు లభ్యమయ్యేలా సొసైటీ పరిధిలో నూతన దుకాణాలను 15 రోజుల్లో ఏర్పాటు చేసి అన్నదాతకు మేలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ యు.వి.ప్రసాద్ రావు, మేనేజర్ ఆర్.రమేష్ బాబు, వి.సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.

హస్తకళాకారులు, చేనేతలకు సృజనాత్మక పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హస్త కళాకారులు, చేనేత కార్మికుల సృజనాత్మక సామర్థ్యాన్ని పెంచడం, సంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సంప్రదాయ హ్యాండీక్రాఫ్ట్‌లు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించనుందన్నారు. రాష్ట్రానికి చెందిన 18 సంవత్సరాల వయస్సు పైబడిన హస్త కళాకారులు, చేనేత కార్మికులు, డిజైనర్లు, విద్యార్థులు ఇతర వ్యక్తులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఏటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణాజిల్లాకు చెందిన కలంకారీ బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పెట్రీ హ్యాండీక్రాఫ్ట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సావనీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను పరిచయం చేయడంతో పాటు ధర్మవరం సిల్క్స్, ఉప్పాడ సిల్క్స్, వెస్ట్‌కోట్స్, మంగళగిరి, బందరు, రాజమహేంద్రవరం, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్‌లు, పాల్స్, టస్సై, వెస్ట్‌కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచయం చేస్తామన్నారు. కళాకారులు తాము కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను జూలై 16వ తేదీ లోగా రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించవచ్చునని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రెవెన్యూ శాఖ సేవలు వెలకట్టలేనివి



ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): రెవెన్యూశాఖ అందించే సేవలు వెలకట్టలేనివని, అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వరదలు, తుపానుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా సేవలు అందించేది రెవెన్యూ విభాగమేనన్నారు. ఏ ప్రభుత్వంలో పనిచేసినా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం వ్యవహరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకె బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ సేవలను కొనియాడారు. అనంతరం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన ఉద్యోగుల వారసులు 64 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎంవీ శ్యామ్‌నాథ్, పేటేటి సత్యనారాయణ, రిటైర్డ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిదే...

రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి ఎవరి దారి వారిదే లాగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి ఎంపీ బాలశౌరి హాజరయ్యారు. ఆయన ప్రసంగం పూర్తయిన తరువాత వెళ్లిపోయారు. తరువాత మంత్రి కొల్లు రవీంద్ర కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన మసులా బీచ్ ఫెస్టివల్ నాలుగురోజుల కార్యక్రమాల్లో కూడా ఎంపీ బాలశౌరి ఎక్కడా లేకపోవటంతో వీరిరువురి మధ్య అంతరం పెరిగిందని టీడీపీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భయంతో హత్య చేసిన మైనర్ బాలుడు

పసుభొట్లపాలెం హత్య కేసును ఛేదించిన పోలీసులు



నిందితుల్ని ప్రదర్శించిన సీఐ సోమేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ

గుడ్లవల్లేరు: నాలుగు గోడల మధ్య కట్టేసి కొడితే... పిల్లి అయినా పులి అవుతుందన్న చందంగా... ఒక పాత నేరస్తుడిని ఒక మైనర్ బాలుడు హత్య చేసిన ఉదంతం ఆలస్యంగా బయట పడింది. తనతో పాటు తన వారిని పాత నేరస్తుడు అస్తమానం వేధిస్తున్నాడన్న భయంతో ఒక మైనర్ బాలుడు ఆ పాత నేరస్తుడిని హత్య చేసిన సంఘటన గుడ్లవల్లేరు మండలం కొతవరం గ్రామ శివారు పసుభొట్లపాలెంలో జరిగింది. గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గుడివాడ సీఐ ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్య చేసిన నిందితుడితో పాటు దాచిన వ్యక్తుల్ని ప్రదర్శించారు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 17న ఉదయం 7 గంటల సమయంలో పసుభొట్లపాలెంలోని దళితవాడలో చిన్నం వసంతరావు ఇంటికి ఎదురుగా సిమెంట్ రోడ్డు పక్కగా పంట బోదె గట్టుపై ఒక వ్యక్తి గాయాలతో చనిపోయి పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది.

మృతుడు పాతనేరస్తుడు

ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా... అదే గ్రామానికి చెందిన రేమల్లి వెంకట్రావు(45) అలియాస్ ముసలిగా గుర్తించారు. తల, ముఖంపై ఎవరో బలమైన ఆయుధంతో కొట్టి చంపి ఉంటారని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేని క్లిష్టమైన ఈ కేసును సీఐ సోమేశ్వరరావు, ఎస్.ఐ సత్యనారాయణ ఛేదించారు. చనిపోయిన వెంకట్రావుతో పాటు ఒక మైనర్ బాలుడు అత్యంత స్నేహంగా ఉండేవాడు. అదే గ్రామంలో పదవ తరగతి వరకు చదివిన ఆ బాలుడు చదువు అబ్బక చెడు అలవాట్లకు లోనయ్యాడు. వెంకట్రావుతో పాటు ఆ బాలుడు పనులకు వెళుతూ ఉండేవారు. వచ్చిన డబ్బులతో మద్యం తాగి తిరుగుతూ స్నేహంగా మెలిగేవారు.

మద్యం ఇప్పించమని తరచుగా వేధింపులు

ఈ బాలుడిని వెంకట్రావు మందు ఇప్పించమని అస్తమానం వేధించేవాడు. ఇప్పించకపోతే చంపుతానని బెదిరించేవాడు. గతంలో వెంకట్రావు చేసిన హత్యను ఆ బాలుడికి కథలు కథలుగా చెప్పి భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరించేవాడు. ఆ భయంతో వెంకట్రావు ఏం చెప్పినా...ఆ బాలుడు తప్పని సరై చేసేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న ఇద్దరూ పనికి వెళ్లి వచ్చారు. వేర్వేరు చోట్ల, విడివిడిగా ఎవరు మందు వాళ్లు తాగారు. అనంతరం ఆ బాలుడు తనకు అన్నయ్య వరుసైన చిన్నం విజయకుమార్ అలియాస్ సుబ్బు అనే వ్యక్తి ఇంటిలో మరొక బాలుడితో కలిసి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో వెంకట్రావు ఆ బాలుడు పడుకున్న ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటి యజమాని విజయకుమార్ భార్య బత్తుల కావ్యశ్రీ తలుపు తీయకుండానే లేదని లోపలి నుంచే సమాధానం చెప్పింది. కొద్దిసేపటి తర్వాత వెంకట్రావు మళ్లీ ఆ ఇంటికి వెళ్లి ఆ బాలుడు కావాలంటూ వేధించసాగాడు. కావ్యశ్రీ మళ్లీ తలుపు తీయకుండానే బాలుడు ఇక్కడ లేడని చెప్పింది. అప్పుడు ఆమెను అబద్ధం చెబుతున్నావని వెంకట్రావు తిట్టాడు. వాడిని ఎందుకు దాస్తున్నావని అసభ్యపదజాలంతో దూషించాడు. వాడి సంగతి, నీ సంగతి తేలుస్తానంటూ తిట్టాడు.

అతనితో ఎప్పటికైనా తనకు ప్రాణగండమని..

ఇదంతా లోపలి నుంచి గమనిస్తున్న ఆ బాలుడు వెంకట్రావు బతికి ఉంటే ఎప్పటికైనా తన ప్రాణానికి ప్రమాదం తప్పదనే భయంతో పక్కనే ఉన్న బలమైన ఇనుప రాడ్డును తీసుకుని వెంకట్రావు వెనుకే వెళ్లాడు. పక్కనే ఉన్న మరో బాలుడు ఆపుతున్నా ఆగలేదు. వెంకట్రావు తలపై బలంగా రెండు, మూడు సార్లు కొట్టగా వెంకట్రావు అక్కడే పడిపోయాడు. ఆ రాత్రి సమయంలో అప్పుడే పనికి వెళ్లి తిరిగి వచ్చిన విజయకుమార్ పడిపోయిన వెంకట్రావును పరిశీలించగా చనిపోయాడని నిర్ధారించుకున్నాడు. వెంటనే ఇద్దరూ కలిసి ఇంట్లోకి వెళ్లి కావ్యశ్రీకి, విజయకుమార్ తల్లి జయకు వెంకట్రావు చనిపోయాడని చెప్పారు. ఏమీ జరగనట్టుగానే ఆ రాత్రి వాళ్లు పడుకున్నారు. ఉదయాన్నే కావ్యశ్రీ ఇనుప రాడ్డును ఎవరికీ అనుమానం రాకుండా తీసుకుని వెళ్లి, వాళ్ల అమ్మమ్మ ఇంట్లోని నీళ్ల బావిలో పడవేసింది. విజయకుమార్, జయ కూడా నేరాన్ని ఎవరికీ చెప్పకుండా దాచారు. పోలీసులు తమ పద్ధతిలో కేసు దర్యాప్తు చేసి హత్య కేసును ఛేదించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి 7.30 గంటలకు నేరం చేసిన వారితో పాటు నేరం దాచిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్డు, దుస్తులను సీజ్ చేశారు. అనుమానాస్పద మృతిని హత్యగా కేసు నమోదు చేసి నిందితుల్ని కోర్టుకు అప్పగించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



లారీ కిందపడి ధ్వంసమైన స్కూటీ, బైక్

చల్లపల్లి: ఊక లోడుతో వస్తున్న లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో రెండు స్కూటీలు, ఒక బైకు, ఒక మినీ లారీ దెబ్బతిన్నాయి. చివరకు లారీ రెండు ఇళ్ల మధ్య ఉన్న సందులోకి దూసుకుపోయి ఆగింది. అదృష్ట వశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అవనిగడ్డకు చెందిన ఈ లారీ రేపల్లె మండలం పేటేరులోని ఒక రైసు మిల్లులో ఊక నింపుకొని పులిగడ్డ, చల్లపల్లి, పామర్రు మీదుగా గుడివాడకు వెళ్లేందుకు బయలుదేరింది. చల్లపల్లిలోని పాగోలు రోడ్డువద్ద గల బ్రహ్మంగారి గుడి వద్దకు రాగానే ఒక్కసారిగా మెలికలు తిరుగుతూ పాములా దూసుకురావడం ప్రారంభించింది. తొలుత ఒక మినీట్రాన్స్‌పోర్టు వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టగా, ఆ వ్యాను ఛాసిస్ ముందుకు జరిగి ఇంజన్‌ను నొక్కటంతో అది నడిరోడ్డు మీదే ఆగిపోయింది. తర్వాత ఊకలారీ పాత ఇనుపసామాను కొట్టు వద్ద పనిచేస్తున్న వ్యక్తిపైకి దూసుకురాగా, అతను గమనించి పక్కకు తప్పుకోగా లారీ అక్కడ ఉన్న ఒక స్కూటీని ఢీకొట్టి రెండు ఇళ్ల మధ్య ఉన్న సందులోకి దూసుకుపోయి ఆగింది. అక్కడ ఉన్న ఒక స్కూటీ, బైక్ కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. పక్కన ఉన్న షెడ్డు పాక్షికంగా దెబ్బతింది. కరెంటు స్తంభానికి ఉన్న సర్వీసు వైర్లు తెగిపడ్డాయి. ఇంత బీభత్సం సృష్టించినా ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఊక లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. రహదారులపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించిన బృందం సమస్యను పరిష్కరించిన అనంతరం కూడా అదే బృందం పర్యటించి అంతా సవ్యంగా ఉన్నట్లు నివేదిక అందజేయాలన్నారు. 2025 మే నెలలో జిల్లాలో మొత్తం 69 రోడ్డు ప్రమాదాలు సంభవించగా వాటిలో 38 మరణాలు, 80 మంది గాయాల పాలయ్యారన్నారు. జాతీయ రహదారులపై అత్యధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కానూరు నుంచి పెనమలూరు వరకు ఉన్న జాతీయ రహదారి డివైడర్‌పై రెయిలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర జంక్షన్లు, హైవే నుంచి సర్వీసు రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి వెంటనే చికిత్స అందజేసి మరణాల సంఖ్య తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రవాణాధికారి మనీష, జాతీయ రహదారుల పీడీ విద్యాసాగర్, ఆర్అండ్‌బీ ఈఈ లోకేష్, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు పాల్గొన్నారు.

సులభతర వాణిజ్యంలో జిల్లా అగ్రస్థానంలో ఉండాలి

కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సులభతర వాణిజ్యంలో జిల్లా అగ్రస్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో గూగుల్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,995 మంది పారిశ్రామికవేత్తలకు గత సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీ వరకు 17 ప్రభుత్వశాఖల ద్వారా పలు పరిశ్రమలు నెలకొల్పేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక మండలి పరిధిలో పారిశ్రామికంగా చేపట్టిన సరళీకృత విధానంలో ప్రతి ఏటా ర్యాంకింగ్ ఇస్తుందని, ఈ ప్రకారం 2024–25 సంవత్సరానికి అనుమతులు పొందిన వారితో అభిప్రాయాలు సేకరించి ర్యాంకింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనుమతులు ఇచ్చిన సంబంధిత శాఖల అధికారులు, వ్యాపారవేత్తలతో సానుకూలంగా మాట్లాడి వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అందించిన సేవలను గుర్తుచేస్తూ మరోసారి అవగాహన కల్పించాలన్నారు. లబ్ధి పొందిన వారి నుంచి ఎలాంటి ప్రతికూల స్పందన రాకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఆర్.వెంకట్రావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు, కార్మికశాఖ ఉప కమిషనర్ ఆషారాణి, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఇ.సత్యానందం, తూనికలు, కొలతల ఉప కమిషనర్ చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.